"ఏటా లప్పా! పిన్ని ఎళిపొచ్చీసి నా వట ఏటీ?"
"ఏటంటే నా నేటి సెప్పుతాను. పాత కతనే. లగ్గం అయిన కొడ్నుంచీ పెతీ పండకి ( అల్లుడోడ్ని కూడా బొట్టితో పాటూ నావే, మావే ఎల్లి పిలునుకొస్తున్నామా! ఏగవే మాక్కలి( న కాడికి కోకో, రేకో ఎడ తన్నామా! ఇయి కాక ఇంకా నదివింపులు సాలినాయి కాదని శ ెట్టిసి యేపు తింటున్నాడు. పెతీసారి ఏదో ఓటి



# ఊరేగి

## శీలా సుభద్రాదేవి

నొల్లుకుపోతున ్న నయికిలు బండి ఊసు మాత్రం ..." ఆయనం వచ్చినట్లయి పైట కొంగుతో కళ్ళు వత్తుకుంది నారాయణమ్మ.

"ఏ నం యికిలు బండి?" గూట్లోని దువ్వెన తీసికొచ్చి నారాయణమ్మకు ఎదురుగ్గా అరుగు మీద కూచుంటూ అంది బంగారి.

"అవనే, లగ్గ వప్పుడు అడిగినాడు కాదా? అప్పటి కొడ్నుంచి పండగ పండక్కీ కొనాలను కొన్నా మరే కర్సో నెత్తిన వడి కాన్దబ్బులు మిగల్డం లేదు. నా నేటి సేతు ... ఇనయం మర్సి, ఊసులాడుకు ఇక్కడే కూకుండి పోయినాను. రెడ్డిగారి చేన్లో కోతలకు ఎల్లినావు కాదా! నీ కాడ ఉంటాయని వొచ్చినాను. రెండు డబ్బాల బియ్యం ఉంటే సెట్టోలె. నా ల్దినానాల్లో ఒల్లి కొలుస్తా."

"కొలుస్తాలే దాని కేటి గానీ, మీ పెద్ది నాయుడు గోరి పొలం ఎప్పుడు కోస్తున్నారు? ఈ యేడు కంకులు పెటపెట లాడుతున్నాయి. మీకు గింజలు కూడా బానే కొలుస్తుండొచ్చు."

"ఏమో! ఎప్పుడు కొస్తారో ఆ దేముని కెరుక. పెతీ యేడూ ముందే కోతలు కోయిచ్చేవోడు. ఈ యేడు దానూసే ఎత్తినాడు కాదు. మా మావకి ముప్పొద్దులూ అదే యాదావనగా ఉంది. నానూ ఆశ పెట్టు క్కూకుడన్నాను. ఈ యేడన్నా గింజలు అమ్మితే ఆ సెయికిలు బండేదో కొనిచ్చేత్తే గొడవ తీరుద్ది. తర్వాత మాం ఉంటే తింటాము లేకుంటే తొంగుంటాం.

"అవునే నారాయణమ్మా: మా సిమ్మాది సదువు అయిపోనాదా!"

"ఈ ఏనం కాలానికి వది పూర్తయితది. ఆస్టలు నుండి వచ్చేత్తాడు. తర్వాత ఆడికి ఏదో కొలువు నూనుకుంటే ఏన్నాళ్ళ నన్నాళ్ళుగా ఉంటాడు. మా అప్పు కూడా తీరిపోతాది." కళ్ళల్లో ఆశ మెరిసింది.

"ఇంకేటి మీ కట్టాలు కడతేరి పోతాయి."

అంతలో బంగారి కూతురు గౌరి చేటలో బియ్యం పోసుకు వచ్చింది. నారాయణమ్మ కొంగులో కొలిచి పోసింది.


"చానా పొద్దు పోయినాది. ఇంకా కూ డొండాలా" అంటూ లేవబోయింది నారాయణమ్మ.

"పిన్నమ్మా! సినీమా వోళ్ళు మనూ రొస్తన్నారంట కాదా! మీ పెద్ది నాయుడు గార ఎర్రమేడలోనే దిగుతారట. నిజమేనా" అంది గౌరి.

"అదేమోనే గవురీ. నానూ ఇన్టమే కానీ నా కేటీ తెల్దు. మరి నా నెల్తున్నా నప్పా" అంటూ వెళ్తున్న నారాయణమ్మ వంళ్ళ వెనక నుండి గౌరి కేక వినిపించి ఆగింది.

"పిన్నమ్మా! సిన్నక్కని నాను ఒకరవ్వ రమ్మన్నానని సెప్పవా. జంక్షను కాడ సేవలకి ఎల్ల మంది మాయమ్మ. నాకు తోడుగా వొట్టు కెల్తాను."

"అలాగే లేంమే!" అని తిరిగి కేకేసింది. ఆ రెండిళ్ళకి మధ్య ఓ వదిహేను గుడిసెలు ఉంటాయి.



అప్పుడే కనుచీకటి పడుతుందేమో. గుడిసె లోపల మరీ చీకటిగా ఉంది.

"ఏటీ పిన్నీ! దీప మన్నా ఎలిగించి నావు కాదేటీ!" అంటూ లోని కెళ్ళింది నారాయణమ్మ. ఎక్కడా కనిపించ లేదు చిన్న పైడి తల్లి.

"ఏటిది! ఎక్కడికి పోయినాది?" అత్రతగా పెరటి గుమ్మంలోకి వెళ్ళింది. గుమ్మం బయట గోడకి ఆనుకొని కూర్చొనుంది.

మనసులోనే హమ్మయ్య అనుకొంది నారాయణమ్మ. చిన్ని ముఖాన్నంత మబ్బులు కమ్మినట్లుగా దుఃఖం అలుముకొని, ఇప్పుడో మరి కాసేపటికో కుంభవృష్టి కురుస్తుందేమో నన్నట్లుగా ఉంది. నారాయణమ్మ తల్లి మనసు జాలితో నిండిపోయింది.

"ఓలి పిన్నీ! గవురి జంక్షను కాడికి నిన్ను తోడు రమ్మన్నాది ఎల్లు. నీ కోసం కాసుకోనుంది. ఎలి పొచ్చేటప్పుడు ఓ పావలా పచ్చి మిరపకాయలూ, ఓ పావలా ఉల్లిపాయలూ ఒట్టుకురా." కాసేపు అలా నేస్తాలతో తిరిగి వస్తేనన్నా దుఃఖ భారం తగ్గుతుందేమోనని బుజ్జగిస్తున్నట్లు గా అంది బుడ్డీ దీపం వెలిగిస్తూ.

ఏ కళ నుందో మనసులో వెళ్ళాలని లేకపోయినా లేచి వెళ్ళింది చిన్నపైడి తల్లి.

పొయ్యిలో పుల్లలు వెలిగించి, అన్నంకి ఎసరు పెట్టి పది అడుగుల దూరంలో ఉన్న నూతి దగ్గరికి కుండ, చేదా పట్టుకొని వెళ్ళింది నారాయణమ్మ. యాంత్రికంగా పనిచేస్తున్నా మనసు దారిన మనసు ఆలోచిస్తూనే ఉంది.

"ఈ సుట్టు అల్లుడు గట్టిగానే పట్టు పట్టినట్లున్నాడు. ఎలా ఈ గండం గట్టెక్కుతాదో బోద పట్టం లేదు. పెద్ది నాయుడు గారింటో పనిచేసేటప్పుడు మావని పెద్ద పాలేరు పని చెప్పి ఉబ్బేస్తారు. కానీ పెట్టేటప్పుడు మాత్రం అందరి కెట్టా గిత్తరో, ఈడీకీ అలాగే యిత్తరు. ఈడి అలుసు చూసి మరీ నొక్కేస్తునారు. భూపెపంచకం అన్నేయాలతో మండిపోతున్నది. పప్పులు, ఉప్పులూ అన్నీ ఇయాల రేపుకీ ప్రియం అయిపోతున్నాయి. కూల్దబ్బులు పెంచరు కానీ, కొలిచే ధాన్యం కరువు పేరు చెప్పి తగ్గించేత్తున్నారు. ఈ యేడు ఏటైందో కోత ల్లేవు. ఇయ్యాలన్నా కబు రేవన్నా ఒట్టుకొస్తాడో లేదో ఈ ఎంకయ్య మావ..." ఇలా సాగుతూనే ఉన్నాయి ఆమె ఆలోచనలు.

నీళ్ళు గోలెం నిండా తోడి అన్నం వండినాక ఆ పొయ్యి మీదే ఎంకయ్య స్నానానికి నీళ్ళు పెట్టి వచ్చి వీధి గుమ్మంలో కూచుంది.

దూరంగా నేస్తులతో కలిసి వస్తున్న చిన్న పైడితల్లి ముఖంలో విషాద మేఘాలు విడచి పెట్టిన ఛాయలు చూసిన నారాయణమ్మ ముఖం కాస్త తేట పడింది.

"ఓలమ్మా! జంక్షనుకాడ సినీమా వోళ్ళని మాం సూసినామే. బాలకిష్ణ, విజీశాంతి, ఇంకా ఎవ లెవలో ఎల పొచ్చీసినారే! పెద్ద నాయుడి గోరి మేడ కేసే ఎల్తున్నారు." సంబరంగా అల్లంత దూరం నుండే చెప్తూ వచ్చింది.

"ఏటేటీ! గవురి సెప్పింది నత్తేవే నన్న మాట! ఇక్కడికి ఎందు కొచ్చీసి నారు సెప్మా!" అంది అబ్బురంగా నారాయణమ్మ కూడా చిన్ని కొంగులోని ఉల్లిపాయలు అందుకొంటూ.

"మనూర్లోనే సినీమా తీస్తారటే!"

"మనూ ర్లోనా! ఇక్కడే వుంది? ఏటేపు చూసినా మట్టీ మశానం, గుడిసెలే కాదా?"

అట్లా వాళ్ళేవో సినిమాల గూర్చి మాట్లాడు కుంటుండగానే వెంకన్న వచ్చాడు. ఇంట్లో వాతావరణం ఎలా గుందోనని బెంగ పెట్టుకుంటూ గుబులు గుబులుగా వచ్చిన వెంకన్న కబుర్లు చెప్పుకొంటున్న తల్లీ కూతళ్ళను చూసి ఆశ్చర్య పోయాడు.

"ఏటీ! తల్లీ కూతురు తీరిగ్గా ఊసులాడు కుంటూ కూకుడున్నారు?" అంటూ వచ్చాడు.

"ఇయ్యాల బేగి వచ్చేసి నా వేటీ?" వెంకన్నకి స్నానానికి నీళ్ళు పెట్టటానికి లేస్తూ అంది నారాయణమ్మ.

"మల్లా ఎల్లాలి. పెద్ది నాయుడు గోరి అయిద్రాబాదులో ఉండే అప్పసెల్లెలు గోరి సేయితులు ఈడ సినీమా తీయటానికి వొచ్చినారు. ఆ వొచ్చిన బందుగు లందరికీ మంచీ సెడ్డా నూసే పూచి నాకే ఒప్ప సెప్పినారు. ఆల్లు కాకుండా యింకా పెద్ది నాయుడిగోరి అల్లుడు గోరు, కూతురూ కూడా వచ్చినారు. ఆల్లు న్నన్ని నాళ్ళూ కాడనే కనిపెట్టుకు నుండాలట. ఆల్లందరికీ వంటోడ్ని పెట్టీ వంట సేయుత్తున్నారు కాదా! ఆడనే మిగిలిందో తగిలిందో రెండు ముద్దలు తినేసి ఉండమన్నారు. నీకు సెప్పి బేగి ఎలి పొచ్చీమన్నారు."

"మరి తానం సేయవా?"

"తానం గీనం అంటే కాదు. ఆల్లంతా ఒచ్చీసినారు కూడా. కూడే రెండు ముద్దలు పెట్టేసి. మల్లా ఎప్పుడైతా దో తినీసి ఎల్లిపోతాను" అంటూ వేడి నీళ్ళు కాసిని తీసుకొని ముఖం కాళ్ళు చేతులూ కడుక్కొని వచ్చి చతికిల బడ్డాడు.

"అన్నట్లు మర్చిపోయినాను. సంకురాత్రి పండ క్కేనమని అల్లుడు ఎలిపొస్తానని కబురు పంపినాడు ..." కుండ లోంచి గ్లాసుతో నీళ్ళు తేబోతున్న చిన్ని ఉలికి పడింది. పళ్ళెంలో అన్నం వేస్తున్న నారాయణమ్మ వెంకన్న ముఖంలోకి ఆశ్చర్యంగా చూసింది.

"కావయ్య బావ విజీనగరం సంతకి ఎల్తే ఆడ కలిసి చెప్పినాడట. పండగ లోపున కోతలు అయ్యేలా కనిపించటం లేదు. సెయికిలు బండి ఇస్తే గాని తాను ఈడ అడుగు పెట్టనని, బొట్టిని ఒట్టు కెల్లనని చెప్పినోడు, మల్లా ఈ కబురేటో బోద పట్టం లేదు."

"పోనీలే మల్లా మనసు మార్చుకున్నా డేటో."ఆశ మెరిసింది నారాయణమ్మ ముఖంలో.

చిన్ని మాత్రం నిర్వికారంగా కూర్చొనే ఉంది అన్నం తింటూ. నంజుకుంటునె్న పచ్చి మిరపకాయ కటిక్కన కొరికింది.

మరి మాటలు లేవు వాళ్ళ మధ్య. అందరూ ఎవరి మానాన వాళ్ళు ఆలోచనలో ముగించారు.

కప్పుకోటానికి దుప్పటి తీసుకొని వెంకన్న



వెళ్ళిపోయాడు. తల్లీ కూతురూ మాటలు లేకుండానే బొంతల మీదికి ఒరిగారు.

మర్నాడు ఉదయం నుండీ ఊరంతా సందడి. ఒకవైపు సంక్రాంతి రోజులు మరో పక్క సినీమా వాళ్ళ సందడి, పెద్ది నాయుడి పొలంలోనే షూటింగ్ ప్రారంభమయ్యింది.

పెద్దినాయుడి గారింట్లో పనికి నారాయణమ్మ, కూతుర్ని సాయం తీసుకొని చీకట్నే వెళ్ళింది. గిన్నెలు తోమటం, బట్టలు ఉతకటం అయినాక, అల్లు డొస్తాడేమోనని చిన్ని మిగిలిన వంటకాలని తీసుకొని వెళ్ళమని ఇంటికి పంపింది. నారాయణమ్మ మాత్రం వంట దగ్గర పై పనులు చేయటానికి అక్కడే ఉంది.

పెద్ది నాయుడి గారింట్లో వాళ్ళంతా ముస్తాబై షూటింగుకి బయల్దేరారు. పని పూర్తి చేసుకొని, అమ్మ గారిచ్చిన నూకలని మూట గట్టుకొని నారాయణమ్మ కూడా ఇంటికి బయల్దేరింది.

"ఏటి సిన్నీ, ఆ డొచ్చినాడా?" ఆత్రతగా అడిగింది రాగానే.

"ఆఁ ఒచ్చినాడు. కూడు తినీసి సినీమా తీసే కాడకి పోయినాడు." ఏ భావం లేకుండా అంది చిన్ని.

"ఏటంతన్నాడు. ఆ ఊనుగాని మల్లా ఎత్తడా?"

"లేదు సినిమా వోల్ని సూడాలని ఒచ్చినాడు మన కోసం కాదు" తల్లి తెచ్చిన నూకల్ని చెరుగుతూ అంది.

"నువ్వు కూడా ఎల్లక పోయినావా?" అంది నారాయణమ్మ.

కూతురు మాట్లాడలేదు. తల్లి నూతి దగ్గరికి కుండ తీసుకొని వెళ్ళి పోయింది. మర్నాడు, ఆ మర్నాడు - ఇదే విధంగా పది రోజులూ ఇంచు మించు అదే పద్ధతిలోనే గడిచి పోయాయి.

పెద్దినాయుడి గారింట్లో పెద్ద ఎత్తున చేయిస్తున్న వంటల వలన మిగులూ, తగులూ తెచ్చుకొని పండగ కూడా అలాగే గడిపేశారు. చిన్ని మొగుడు పండగ వెళ్ళే వరకూ ఉండి ఎవరితోనూ ఏమీ చెప్పకుండానే వెళ్ళిపోయాడు. పండగ పనులే కాక సినీమా వాళ్ళ పనులన్నీ కూడా చూడటం వలన ఈ సారి ప్రతీయేటా కొలిచే ధాన్యం కాక డబ్బు కూడా బాగా ముడుతుందనీ, అల్లుడి కోరిక తీర్చవచ్చునీ అనుకున్నారు వెంకన్న దంపతులు.

## వ్యాయామం క్రీడలు



ఆ రోజుల్లో వ్యాయామ రంగంలో వ్యాయామ అధ్యాపకులుగా ఉండి పదవికి న్యాయం చేసి, తరువాత అనేకమంది యువ క్రికెట్ ఆటగాళ్ళకు శిక్షణ ఇచ్చి క్రీడారంగానికి కూడా సేవ చేసి తరించిన మహానుభావుల్లో స్వర్గీయ ఏ. మల్లవరాజు ఒకరు. వీరు పాఠశాల, కళాశాలల్లో చదివే రోజుల్లో ప్రముఖ ఫుట్‌బాలు ఆటగాడుగా పేరు సంపాదించారు. అజానుబాహుడు. 1935 నుంచి మహారాజ కళాశాల, విజయనగరంలో వ్యాయామ అధ్యాపక వృత్తిని చేబట్టి విద్యార్థుల మన్ననలను పొందారు. వీరు క్రికెట్ క్రీడలో కూడా నేర్పరి. ఆ విద్యార్థుల మన్ననల వల్లనే యువ క్రికెట్ ఆటగాళ్ళకు శిక్షణ ఇచ్చారు. వీరి సేవలను గుర్తించి ఆంధ్రా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షులలో ఒకరినిగా చాలా సంవత్సరాలు ఎన్నుకున్నారు. అనేక క్రీడా సంస్థలకు సేవ చేస్తూ వసి, పదిహేను సంవత్సరాల క్రితం దిగవంతులైనారు.

ఏకా

సినీమా వాళ్ళని సాగనంపేకా పెద్దినాయుడు వెంకన్నని పిలిచాడు "రేపటి నుండి పొలం కోతల సంగతి చూడాల్రా వెంకా!"

"అలాగే బావు! ఎంత మందిని మాట్లాడ మంటారయ్యా" అన్నాడు వినయంగా చేతులు కట్టుకొని.

"ప్రతీ యేడు కుదుర్చుకొనే వాళ్ళలో సగం మందిని మాట్లాడు, సరి పోతుంది కాబోలు."

ఈ సుట్టు పంట యిరగ్గాసింది. సగం మంది సంటా డేటీ బావు అనుకున్నా మరేమీ మాట్లాడ లేదు. వెంకన్న అలవాటు ప్రకారమే.

"రేపు పెందల కాడనే ఎలిపొచ్చి పని మొదలెట్టిస్తానయ్యా" అని చెప్పి రేపు కోతలకి పిలవ వలసిన వాళ్ళకి దార్లో చెప్పి ఇంటికి వెళ్ళిపోయాడు.

మర్నా డుదయం చీకట్నే లేచి రాత్రి అన్నం తిని బయల్దేరాడు వెంకన్న. పెద్ది నాయుడు గారింటికి చిన్నిని పంపి నారాయణమ్మ కూడా బయల్దేరింది.

అల్లంత దూరా న్నుండే కంకులు తల లూపుతూ సువాసనలు వెదజల్లుతూ కనిపించే పైరు కనిపించ లేదు. ఇంకా ఆత్రతగా గబ గబా నడుచుకుంటూ వెళ్ళాడు వెంకన్న. చూసేసరికి గుండె గుభేలు మంది. పదిహేను రోజుల బట్టి నీళ్ళు పెట్టడం అన్నీ మేం చూసుకుంటామని వెంకన్నని ఇటు వేపు రానీయ లేదు, పెద్దినాయుడు గారి అబ్బాయిలు. కానీ ఏదీ -?

"ఏటీ! పచ్చగా కల కల్లాడే సేను యిలాగయిందేటి? ఏ అచ్చోసిన ఆంబోతులో ఎర్రెత్తి కుమ్మేసినట్లు ఇలా గయిందేటి?" కనిపెంచిన పిల్ల దుర్మార్గుల చేతులో చిరిగిన విస్తరయినట్లుగా, గుండె పగిలినట్లుగా అయిపోయింది వెంకన్నకి. ఒకవైపు తలలు వాల్చిన పైరుని, మరోవైపు నేల రాలిన కంకుల్ని పిచ్చి వాడిలా తడుముతున్న వెంకన్నని చూసి ఏం చెయ్యాలో తోచనట్లుగా నివ్వెర పోయి ఉండి పోయింది. ఆవిడకి ఏమీ అర్థం కావటం లేదు.

"ఏటి మావా! అలా ఎర్రోడిలా గుబులు పట్టిపోతా వేటీ? మొన్న సినీమా వోలు సినీమా తీసినారు కాదా? అందుకే అలాగయి పోనాది. అంత మాత్రానికే ఏటయి పోనాదని బావురు మంటారు?"

"అది సెప్పింది నిజమే! అంత బాదడి పోతన్నా వేటయ్యా నీ సొంత సేను కాదు కదా! అల్ల సేను అల్లిష్టం. సొలూరుకో" అని పెద్దోళ్ళంతా ఓదారుస్తుంటే

"ఓలప్పా! ఇక్కడే కదే విజీశాంతి కట్టమీన డేన్సాడుతూ జారి పోబోతుంటే బాలకిష్న వాటేసుకుంటాడు."

అక్కడ మళ్ళీ సినీమా జరుగుతున్నట్లే, తామే హీరోయిన్ల న్నట్లుగా కలలు కళ్ళలో మెరుస్తున్నే కన్నె పిల్లలు.


ఇలా తలో రకంగా వ్యాఖ్యానాలు రేగాయి. అంతలో -

"అదిగో! పెద్దినాయుడు గోరు ఎలిపొస్తున్నారు. అడ్డు లెగండెహె" అంటూ ఒక ర్నొకరు తోసుకుంటూ జరిగారు.

వెంకన్న చతికిల పడినవాడు కాస్తా ఒక్క ఉదుటున లేచి.

"బావూఁ! ఏటిది పచ్చని పైరు ఇలాగై పోనాదేటి బావూఁ" అంటూ కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు.

"అవున్రా వెంకా! మొగమాటానికి పోయి దగ్గరోళ్ళని కాదనలేక షూటింగుకి ఒప్పుకున్నాను. మరేం చేస్తాం. నష్టం భరించాల్సిందే! ఉన్నదే కోయించి, మార్చి సంచుల కెత్తు" అని వెంకన్న భుజం తట్టి చేనంత కలయ చూసి



వెళ్ళిపోయారు.

బాబు గారే అలా అనేసరికి వెంకన్నకి నోట మాట రాలేదు. అన్యమనస్కుడై అట్లాగే పని మొదలెట్టించాడు. నాలుగైదు రోజులు పట్టే పని ఈసారి రెండు రోజులకే పూర్తయి పోయింది.

ఎప్పటి లాగే దగ్గరుండి బస్తాల కట్టించి బండికెక్కించాడు వెంకన్న. మిగత కూలీ లందరికీ పెద్దినాయుడు గారి కొడుకు కూలీ లెక్క గట్టి యిచ్చేశాడు. వెంకన్నని మాత్రం 'ఇంటి కెళ్ళి తీసుకోమ'ని చెప్పారు. బోరింగు దగ్గర కాళ్ళూ చేతులూ శుభ్రంగా కడుక్కొని పెద్ది నాయుడి గారింటికి వెళ్ళాడు వెంకన్న.

"రా! రా! పని పూర్తయిందా? నీతో ఓ ముఖ్యమైన మాట చెప్పాలని ఇక్కడికి రమ్మన్నాను". పడక్కుర్చీలో కూర్చున్న పెద్దినాయుడు పేవరు పక్కన పెట్టి అన్నాడు.

"ఏటి బావూ ...." చేతి కర్ర స్తంబాని కాన్చి వినయంగా చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

"మరేం లేదురా! ప్రతీ యేడు ధాన్యం కొలిచేవాణ్ణి. ఈసారి పంట నేల పాలయింది, సీనిమా వాళ్ళ ధర్మమా అని వచ్చిన గింజ మాకే సరిపోయేలా ఉంది. అందుకని ఈసారి గింజ కొలవకుండా డబ్బే యిచ్చేయాలనుకుంటున్నాను. కిందటి ఏడాదంత నీకు అడపా దడపా యిచ్చిన అప్పులు తీసేయగా ఇంద ..." అంటూ చేతిలో పెట్టాడు.


చేతిలోని పచ్చ నోటు చూసి నోరు పెగల్లేదు వెంకన్నకి.

"బావూ ... " దీంతో ఏడా దంత ఎల్లా- గడపాలని అడగబోయి ఆగిపోయాడు.

"ఏంట్రా! చాల దంటావా? సర్లే మొన్న పది రోజులకీ సినిమా వాళ్ళ పనులు చూసినందుకు ఇదుగో వాళ్ళు ఇది ఇమ్మన్నారు" అంటూ మరో వంద నోటు ఇచ్చాడు.

మరేమి అనాలో తోచ లేదు. అంతలో చిన్ని దాని మొగుడు, సయికిలు బండి, దాని కాపరం బుర్రలో గిర్రుగన తిరిగాయి. అసహాయత్వంలో మిన్ను విరిగి మీద పడినట్లుగా మనసు మూలిగింది.

"బావూ! " మళ్ళీ పిలిచాడు వెంకన్న.




"ఇంకేంట్రా!" చేతిలోకి తీసుకున్న పేవరుని తప్పిస్తూ అడిగాడు.

"మరేటి నేదు బావూ. మా పిల్ల దాని లగ్గ వప్పుడు అల్లు డోడికి సెయికిలు బండి కొంటానని ఒప్పుకున్నాను. ఇప్పటికీ డబ్బు కూడేయ లేక పోయినాను. మీరు దయదల్సి ఓ అయిదొందలు ఇప్పిస్తే దాని కాపరం నిలబెట్టిన వోళ్ళవుతారు బావూ" జాలిగా ఒక్కొక్క మాటే జార్చేడు.

కాసేపు ఆలోచించి "సరేలే! అలాగే యిస్తాను. ఒరే చిన్న బాబూ ఆడ సందువా పెట్టిలోని కాయితాలు కలం పట్రా" అని కేకేశాడు.

అంత వెంటనే అడగ్గానే యిచ్చేసి నందుకు సంబర పడిపోయి భక్తిగా వంగి దణ్ణ మెట్టాడు వెంకన్న.

నోటు రాసి వెంకన్న చేత వేలి ముద్ర వేయించి మళ్ళీ కాయితాలను జాగ్రత్తగా పెట్టెలో పెట్టమని కొడుక్కి యిచ్చాడు. రెండు మూడుసార్లు లెక్కబెట్టి అయిదొందలూ తీసి యిచ్చాడు పెద్దినాయుడు. మహాప్రసాదంలా అందుకున్నాడు వెంకన్న.

"మరో మాటరా వెంకా! నీ కొడుక్కి ఈ ఏటితో పది అయిపోతాది కదా! ఆడ్ని నా దగ్గర పెట్టేయి. మా గుమస్తా పంతులు పోయిన దగ్గర్నుంచీ నాకు లెక్కలు చూసుకోవటం కష్టమై పోతోంది. నా లెక్కా పత్రం చూస్తుంటాడు - పాతికో యాభయ్యో ఇస్తాలే జీతం లాగ." చెప్పదలచుకొన్నది చెప్పేసి పేవర్లో తలదూర్చేసాడు.

వెంకన్న గతుక్కుమన్నాడు, కొడుకు సిమ్మాద్రిని తలచుకొని ఏ సర్కారు నౌఖరీయో వాడికి దొరికితే కష్టాలు తీరిపోతాయని కంటున్న కలలు ఫెళ్ళున విరిగి రాలిపోయాయి. నీరసంగా నడుచుకుంటూ వెళ్ళాడు. కూతురి కాపరాన్ని నిలబెట్ట గలుగుతున్నందుకు సంతోషించాలో, కొడుకు బ్రతుకును మళ్ళీ ఇదే రాటకి కట్టేస్తున్నందుకు బాధపడాలో తెలీటం లేదు.

మర్నాడు ఉదయం పెద్దినాయుడు కూతుర్నీ అల్లుడ్నీ సాగనంపుతూ అల్లుడి చేతికి ఒక కవరు యిచ్చాడు. "అల్లూడూ! ఇదిగో ఈ పదివేలూ పెట్టి నీకు నచ్చిన స్కూటరు కొనుక్కో. మీ అయిద్రాబాదు బామ్మరిది ధర్మమా అని వచ్చే ఏడు కూడా ఇలాంటి బేరం తగులుతే నీకు నువ్వు కోరిన రంగుల టీవీ కొనియిస్తాను" అంటూ సాగనంపేడు. *

